క్లుప్తంగా

21న మెగా జాబ్ మేళా



పిడుగురాళ్ల: ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో ఈ నెల 21వ తేదీన పట్టణంలోని మన్నెం పుల్లారెడ్డి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జాబ్ మేళా కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఆర్‌అండ్‌బీ బంగ్లాలో గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి చేతుల మీదుగా మెగా జాబ్ మేళా వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. సుమారు 300లకు పైగా సంస్థల్లో ఉద్యోగాలు అందించేందుకు ఈ మెగా జాబ్ మేళా నిర్వహించటం జరుగుతుందని, ఈ అవకాశాన్ని 10వ తరగతి నుంచి డిగ్రీ వరకు చదివిన వారందరు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కాసు సూచించారు. ఈ కార్యక్రమంలో స్కిల్ డెవలప్‌మెంట్ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

తిరునాళ్ల వాల్‌పోస్టర్ విడుదల



గురజాల : పట్టణంలో వేంచేసియున్న పాత పాటేశ్వరి అమ్మవారి తిరునాళ్ల పురస్కరించుకుని సోమవారం వాల్‌పోస్టర్‌లను విడుదల చేశారు. అమ్మవారి దేవాలయంలో నగర పంచాయతీ చైర్‌పర్సన్ పోలు పవన్మయి వీరారెడ్డి ఆవిష్కరించారు. అమ్మవారి 425వ తిరునాళ్ల 22వ తేదీ బియ్యంకొలతతో ప్రారంభమై 23, 24 గ్రామోత్సవం, 25న అమ్మవారి బియ్యం విడుపు కొలత, 26న పొంగళ్ల సమర్పణ, 27న వసంతోత్సవంతో ముగియనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నగర పంచాయతీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ అమ్మవారి కృప కటాక్షం ప్రతి ఒక్కరిపై ఉండాలన్నారు. వాల్ పోస్టర్‌లు ఆవిష్కరించిన వారిలో దేవాలయ కమిటీ చైర్మన్ కనకం ఆదినారాయణ దత్తు, వైస్ చైర్మన్ షేక్ బడేజానీ, బాసిరెడ్డి ఇష్టకామి రెడ్డి, గోళ్ళ సైదయ్య, మంచి అంజి న్నారు.

ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా రమేష్‌బాబు

మాచవరం: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి మాచవరం మండల అధ్యక్షునిగా మండలంలోని వేమవరం గ్రామానికి చెందిన తుడుము రమేష్ బాబు ఎంపికయ్యారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షురాలు దేవరకొండ సుశీల మాదిగ సోమవారం నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎంఎస్‌పీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాతంగి సత్యానంద్ మాదిగ మాట్లాడుతూ మంద కృష్ణ మాదిగ నాయకత్వంలో ఎస్సీ వర్గీకరణ సాధనే లక్ష్యంగా పోరాటం చేస్తామని, మాదిగలకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని అన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు మీసాల బాబు మాదిగ, రామ ఇస్రాయేలు మాదిగ, జడ్డా బాబు మాదిగ, వడ్లమూడి కోటేశ్వరీ మాదిగ పాల్గొన్నారు.

క్రిస్మస్ సందర్భంగా తెలుగు రాష్ట్రాల స్థాయి వాలీబాల్ పోటీలు

దుర్గి: క్రిస్మస్ పండుగ సందర్భంగా మండల కేంద్రం దుర్గిలో తెలుగు రాష్ట్రాల స్థాయి వాలీ బాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు సోమవారం తెలిపారు. ఈ నెల 21, 22, 23 తేదీలలో లూథరన్ చర్చి గ్రౌండ్‌లో పోటీలు కొనసాగుతాయని వివరించారు. మొత్తం ఐదు బహుమతులుంటాయని మొదటి బహుమతిగా రూ.20,116, రెండవ బహుమతి రూ.15,116, మూడవ బహుమతి రూ.10,116, నాలుగవ బహుమతి రూ.7,116, ఐదవది రూ.5,116 అందజేస్తామని తెలిపారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు 20వ తేదీలోపు పేర్ల నమోదుకు 9391104970, 6303388136లను సంప్రదించాలన్నారు.

వైభవంగా షష్టి ఉత్సవం

గురజాల : నగర పంచాయతీ జంగమహేశ్వరపురంలో వేంచేసియున్న భద్రాద్రి శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారి దేవాలయంలో సుబ్రమణ్యేశ్వర స్వామి షష్టి ఉత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా గణపతి పూజ, కుంకుమార్చన, స్కంద హోమం, మంగళహారతి వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువ జాము నుంచి భక్తులు దేవాలయంలో బారులు తీరి స్వామి వారిని దర్శించుకున్నారు.

పంటనష్టం జాబితాపై అభ్యంతరాల స్వీకరణ

నకరికల్లు: మండలంలో మిచాంగ్ తుఫాన ప్రభావంతో 33 శాతానికిపైగా నష్టపోయిన రైతులను గుర్తించి నివేదిక సిద్ధం చేస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు సోమవారం తెలిపారు. ఈనెల 11వ తేదీ నుంచి 18వ తేదీ వరకు పలుగ్రామాల్లో పర్యటించిన ఎన్యూమరేషన్ బృందాలు పంటక్షేత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి 33 శాతంపైగా నష్ట పోయిన పంటల వివరాలు గుర్తించినట్లు తెలిపారు. వరి-230 హెక్టార్లు, మొక్కజొన్న-69 హెక్టార్లు, మినుము-46 హెక్టార్లు, కంది-112 హెక్టార్లు, శనగ-749 హెక్టార్లలో పంటనష్టం వాటిల్లినట్లు గుర్తించామన్నారు. శనగపంట వేసిన రైతులకు 80శాతం రాయితీపై జేజీ-11 రకం విత్తనాలను పంపిణీ చేస్తామన్నారు. పంటనష్టం వివరాలపై సోషల్ ఆడిట్ కోసం ఈనెల 18 నుంచి 22వ తేదీ వరకు సచివాలయాలు, ఆర్బీకేల్లో ప్రచురిస్తామన్నారు. వీటిపై అభ్యంతరాలను ఆయా గ్రామాల్లోని ఎన్యూమరేషన్ బృందాలకు తెలియజేయాలని రైతులకు సూచించారు.

రెండు రోజుల్లో 'వై ఏపీ నీడ్స్ జగన్' పూర్తి

- మండల స్థాయి నాయకుడు ముగ్గురు వలంటీర్లను దత్తతు తీసుకోవాలి
- గురజాలలో అఖండ మెజార్టీతో గెలుస్తాం
- కష్టకాలంలో పార్టీ కార్యకర్తలకు, నాయకులకు అండగా ఉన్నా
- గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

పిడుగురాళ్ల: మరో రెండు రోజుల్లో నియోజకవర్గంలోని అన్ని మండలాలు, గ్రామాలు, మున్సిపాలిటీల్లో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం పూర్తి చేయాలని గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ఆర్‌అండ్‌బీ బంగ్లాలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిచాంగ్ తుఫాన్ కారణంగా వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహణలో అంతరాయం ఏర్పడిందని, రెండు రోజుల్లో గురజాల నియోజకవర్గంలోని ప్రతి ఇంటి గడప వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తట్టి వారికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంత అవసరమో వివరించాలన్నారు. గతంలో టీడీపీ హయాంలో చంద్రబాబు ఇచ్చిన హామీలు ఏ విధంగా నెరవేర్చలేదో, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను ఎలా నెరవేర్చిందో వివరించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఒక నాయకుడు ముగ్గురు వలంటీర్లను దత్తతు తీసుకొని వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించాలని తెలియజేశారు. గురజాల నియోజకవర్గంలో రూ.3,471 కోట్లతో అభివృద్ధి చేశామని, ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధి చెందుతున్న నియోజకవర్గాలలో గురజాల కూడా ఉందని అన్నారు. దాదాపు రూ.1,500 కోట్లతో నవరత్నాలు, మరో రూ.1,900 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించటం జరిగిందన్నారు. ఏ ఇంటిని వదిలిపెట్టకుండా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి జగన్ ఎందుకు అవసరమో వివరించాలన్నారు. సామాజిక న్యాయం కూడా రాష్ట్రంలో, గురజాల నియోజకవర్గంలో జరుగుతుందన్నారు. మరలా గురజాల నియోజకవర్గంలో అఖండ మెజార్టీతో గెలిపించుకోవటం, ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్ రెడ్డిని మరలా గెలిపించుకోవాల్సిన అవసరం మనందరిపై ఉందని ఆయన తెలియజేశారు. గురజాల నియోజకవర్గం గతంలో కంటే నేడు అభివృద్ధిలో భిన్నంగా ఉందన్నారు. 2019 ఎన్నికల తర్వాత పార్టీకి కష్టపడిన వారికి మాత్రమే పదవులు ఇవ్వటం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని మరలా గెలిపించుకోవాలన్నారు. పార్టీ అధిష్టానం మేరకు గురజాల నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకొని వచ్చామని, అదేవిధంగా అధిష్టానం ప్రాధాన్యతను బట్టి ఎవరైనా ఇక్కడ కలిసికట్టుగా క్రమశిక్షణగా పని చేయాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో గురజాల నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, పట్టణ, మండల కన్వీనర్లు, మున్సిపల్ చైర్మన్‌లు, వైస్ చైర్మన్‌లు, కౌన్సిలర్లు, మార్కెట్ యార్డు చైర్మన్‌లు, డైరెక్టర్లు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

చేనేత వర్గ అభ్యున్నతికి ప్రభుత్వం కృషి



సుబ్బారావును సన్మానిస్తున్న స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు

మాచవరం: రాష్ట్రంలో చేనేత వర్గ ప్రజల అభ్యున్నతికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పేర్కొన్నారు. మండల కేంద్రమైన మాచవరంలో చేనేత విభాగం రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా అవ్వారు సుబ్బారావు ఎంపికైన సందర్భంగా స్థానిక చేనేత నాయకులు, కార్మికులు ఆయనకు సన్మాన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఆయన్ని దుశ్శాలువాలతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ చేనేత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక విభాగం ఏర్పాటు చేసి, రాజకీయంగా వారి అభ్యున్నతికి, ఆర్థిక అభివృద్ధికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నట్లు తెలిపారు. సుబ్బారావు మాట్లాడుతూ తన నియామకంపై సంతోషం వ్యక్తం చేస్తూ, పార్టీ విజయానికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు. నియామకానికి సహకరించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, రాష్ట్ర అధ్యక్షుడు గంజి చిరంజీవికి, స్థానిక ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డికి, జోనల్ ఇన్‌చార్జి అన్నపురెడ్డికి, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో గోలి రంగా, జానీ, ప్రసాద్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

తప్పులు లేని ఓటర్ జాబితాను సిద్ధం చేయాలి



బీఎల్‌వోలతో మాట్లాడుతున్న తహసీల్దార్ చక్రవర్తి

పిడుగురాళ్ల: తప్పులు, తడకలు లేకుండా ఓటర్ జాబితాను త్వరలో సిద్ధం చేయాలని తహసీల్దార్ కేఎస్ చక్రవర్తి సూచించారు. పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం బీఎల్‌వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ బీఎల్‌వోలందరు ఓటర్ లిస్ట్‌లోని ప్రతి ఒక్కటి క్షుణ్ణంగా పరిశీలించి నమోదు చేయాలన్నారు. అలాగే మార్పులు, చేర్పులు, ఒకే వ్యక్తికి రెండు, మూడు చోట్ల ఓటు ఉన్నట్లు గుర్తిస్తే ఒక చోట ఉండేలా చూడాలని సూచించారు. బీఎల్‌వోల వద్ద ఉన్న లిస్ట్‌ను ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు పొందుపరచాలని అన్నారు. 2024 జనవరి 1 నాటికి 18 సంవత్సరాలు నిండిన వారు ఆన్‌లైన్‌లో నూతన ఓటును నమోదు చేసుకోవచ్చునని తహసీల్దార్ తెలిపారు. ఈ నెల 9వ తేదీలోపు నమోదు చేసుకున్న ఓటర్ జాబితాను ప్రస్తుతం స్క్రూటినీ నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ధనలక్ష్మి, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగితే కఠిన చర్యలు

కారెంపూడి సీఐ జయకుమార్



దుర్గి: ప్రజలకు శాంతిభద్రతలు కల్పించడమే పోలీసు శాఖ ప్రథమ కర్తవ్యం అని కారెంపూడి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ దార జయకుమార్ అన్నారు. సోమవారం స్థానిక పోలీసుస్టేషన్‌ను సందర్శించి లా అండ్ ఆర్డర్ విషయాలపై రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కారెంపూడి సర్కిల్ పరిధిలోని రెంటచింతల, దుర్గి, కారెంపూడి పోలీసుస్టేషన్ల పరిధిలో రౌడీషీట్ ఉన్న వ్యక్తులను ఆయా పోలీసుస్టేషన్‌లకు పిలిపించి ప్రత్యేకంగా కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గ్రామాలలో అసాంఘిక చర్యలకు పాల్పడే వ్యక్తుల పట్ల చట్టపరంగా కఠిన చర్యలు ఉంటాయన్నారు. పేకాట, మద్యం తయారీదారులు, కోడిపందేలు, బెట్టింగులకు పాల్పడే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. స్థానికులు కూడా అసాంఘిక చర్యలకు పాల్పడే వ్యక్తుల సమాచారాన్ని సంబంధిత పోలీసుస్టేషన్‌కు అందించాలని వారి పేరును గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు.

వైభవంగా అయ్యప్పస్వామి పడిపూజ



ప్రత్యేక అలంకరణలో మండపం

పెదకూరపాడు: మండలంలోని 75 త్యాళ్లూరు గ్రామంలో అయ్యప్పస్వామి పడిపూజ సోమవారం రాత్రి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గణపతి, సుబ్రహ్మణ్యస్వామి, అయ్యప్పస్వామి, హరిహరులకు ఐదు మండపాలను ప్రత్యేకంగా అలంకరణ చేసి, 18 కలశాలతో మహా పడిపూజ చేశారు. పంచలోహ అమృతాభిషేకానికి తొమ్మిది రకాల ద్రవ్యాలతో అభిషేకం చేశారు. డప్పు శ్రీను భజన బృందం ఆలపించిన భక్తి గీతాలు అలరించాయి. నాగరాజు గురుస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాలధారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అయ్యప్ప శరణఘోషతో ప్రాంగణం మారుమోగింది. గ్రామ మాజీ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకులు చిర్రా శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో స్వాములకు, భక్తులకు భిక్ష, తీర్థప్రసాదం అందజేశారు.

పేదలకు మెరుగైన వైద్యమే లక్ష్యంగా..

- ఆరోగ్యశ్రీ పరిమితి రూ.25 లక్షలకు పెంపు
- ఆరోగ్యశ్రీ కార్యక్రమంపై వీడియో కాన్ఫరెన్స్



వీడియోకాన్ఫరెన్సులో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

క్రోసూరు: డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్యక్రమం మరింత మెరుగులు దిద్ది పేదవారికి కార్పొరేట్ వైద్యం అందించే లక్ష్యంగా సోమవారం సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి లాంఛనంగా ప్రారంభించి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మండల వైద్యాధికారులు, రెవెన్యూ, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. క్రోసూరు తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన వీడియోకాన్ఫరెన్సు గురించి ఎంపీడీవో బి.మహేష్‌బాబు వివరిస్తూ సీఎం జగన్ ప్రతి పేదవాడికి మెరుగైన వైద్యం అందించటమే తమ లక్ష్యం అని పేర్కొన్నారు. వైద్యం కోసం పేదవాడు అప్పుల పాలు కాకూడదని స్కీం పరిమితిని రూ.25 లక్షలకు పెంచినట్లు తెలిపారన్నారు. ఆరోగ్య కార్యకర్తలు, సీహెచ్‌వోలు, ఆశా కార్యకర్తలు మహిళా పోలీసులు ప్రతి ఇంటికి వెళ్లి ఆరోగ్యశ్రీ కార్డులు అందించాలని సూచించారు. ఆరోగ్యశ్రీ సేవలు గురించి తెలియని వారు ఎవ్వరు ఉండకూడదు అని పేర్కొన్నారని తెలిపారు. ప్రతి ఇంట్లో ఆరోగ్యశ్రీ, దిశ యాప్‌లు డౌన్లోడ్ చేయించాలన్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ పి.శివరామయ్య, వైద్యాధికారులు డాక్టర్ బాల అంకమ్మబాయి, డాక్టర్ మహమ్మద్ షాద్, ఆరోగ్య విస్తరణాధికారి శిఖా శాంసన్, సూపర్‌వైజర్లు శివుడు, అమర జ్యోతి, మండల ప్రజాపరిషత్ అధ్యక్షులు పెరిమాళ్లపల్లి కోటయ్య, ఏఎంసీ వైస్ చైర్మన్ గార్లపాటి దాసు, పాల్గొన్నారు .

క్రీస్తు జన్మదినం లోకానికి దివ్య సందేశం



విజయపురిసౌత్: క్రీస్తు జన్మదినం లోకానికి దివ్య సందేశమని జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు శేరెడ్డి గోపిరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక సెయింట్ ఆన్స్ పాఠశాలలో జరిగిన సెమీ క్రిస్మస్ వేడుకలలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఏసుక్రీస్తు చూపిన మార్గంలో నడవాలన్నారు. యేసు క్రీస్తు మానవుల పాప క్షమాపణ కొరకే మానవునిగా భూమిపై పుట్టినట్లు తెలిపారు. ఫాదర్ అన్నెం జోసఫ్ తంబి మాట్లాడుతూ క్రీస్తు చూపిన ప్రేమ, కరుణ, జాలి, దయ ప్రపంచ మానవాళికి శాంతి, సమాధానం, సంతోషం కలిగిస్తాయన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన క్రీస్తు జననం నాటిక ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం సుజిత, సిస్టర్ అన్నామరియ, దుగ్గెంపూడి ఇన్నారెడ్డి, జెక్కిరెడ్డి చిన్నపరెడ్డి, మరియదాసు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా ముత్యాలమ్మ తల్లి ఆలయ ప్రతిష్ట



దుర్గి: మండల పరిధిలోని మంగాపురం తండాలో సోమవారం ముత్యాలమ్మ తల్లి ఆలయ ప్రతిష్ట కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఉదయం గణపతి పూజ, హోమాలు నిర్వహించారు. అనంతరం ప్రధాన అర్చకులు రావిపాటి కుసుమహరినాథశర్మ, వెల్లటూరి విజయ కుమార్ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా అమ్మవారి ప్రతిష్టా కార్యక్రమాన్ని భక్తజన సందోహం మధ్య నిర్వహించారు. ఉదయం 11 గంటల నుంచి మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు తోటకూర నాగేశ్వరరావు, మాదాసు వాసు, ఆలేటి వెంకటేశ్వర్లు, భోజియా నాయక్, ఎంపీటీసీ బొంత కృష్ణ, గెలమయ్య, పెద్దిరాజు, మల్లయ్య, హరిలాల్ నాయక్, నగేష్ పలువురు భక్తులు పాల్గొన్నారు.

ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్సీ బాలికలకు కరాటేలో శిక్షణ

నరసరావుపేట: స్థానిక ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్సీ బాలికల స్కూలులో సోమవారం ఉజ్వల భారత మహిళా శక్తి సేవా సంఘం ఆధ్వర్యంలో.ఏర్పాటుచేసిన ఉచిత కరాటే శిక్షణా తరగతులను డీఎస్పీ కేవీ మహేష్ ప్రారంభించారు. అనంతరం సీనియర్ కోచ్ పి.రాంబాబు, జి.సాయిరాం, ఎం.చైతన్య దీప్తి విద్యార్థినులకు కరాటేలో మెలకువలు నేర్పించారు. కార్యక్రమంలో స్కూలు ప్రిన్సిపల్ ఎం.కుమారి, పీఈటీ అశోక్ కుమార్, ఉజ్వల భారత్ మహిళా శక్తి సేవా సంఘ అధ్యక్షురాలు ఎం.విజయలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం

పెదకూరపాడు: పెదకూరపాడు మండలం బుచ్చయపాలెం గ్రామంలో వైభవంగా పోలేరమ్మ అమ్మవారు, మహాలక్ష్మి, పోతురాజు దేవతల విగ్రహ ప్రతిష్టా మహోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిద్ధుప్రసాద్ యోగేశ్వర గురుస్వామి ఆధ్వర్యంలో ప్రతిష్టా మహోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

జెడ్పీ స్థలంలో వాణిజ్య సముదాయం నిర్మించండి

సత్తెనపల్లి: పట్టణంలోని గుంటూరు రోడ్‌లో గల జిల్లా పరిషత్ స్థలంలో వాణిజ్య సముదాయం నిర్మించాలని 11వ వార్డు కౌన్సిలర్ జి.సతీష్‌కుమార్ కోరారు. సోమవారం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెన్రీ క్రిస్టినాను కలిసి వినతిపత్రం అందించారు. పట్టణంలోని 11వ వార్డు పరిధిలో సర్వే నెంబర్.12లో జిల్లా పరిషత్‌కు చెందిన రెండు ఎకరాల స్థలం ఉందని, దానిలో కొంత భాగంలో పంచాయతీరాజ్ గెస్ట్‌హౌస్ నిర్మించి ప్రారంభోత్సవం చేయలేదన్నారు. మిగిలిన స్థలం ఆక్రమణలకు గురవుతోందని అలా కాకుండా వాణిజ్య సముదాయం నిర్మించి పేదలకు ఉపాధి కల్పించాలని కోరారు. గెస్ట్ హౌస్‌ను ప్రభుత్వ కార్యాలయాల అవసరాలకు వినియోగించేలా చూడాలని కోరారు.

కారెంపూడి ఆర్‌అండ్‌బీ రహదారికి రూ.4.10 కోట్లు

- రెండు రోజుల్లో పనులు ప్రారంభం
- ఈఈ రాజానాయక్, డీఈ గోపీకృష్ణ వెల్లడి

కారెంపూడి: కారెంపూడి మాచర్ల ప్రధాన రహదారి నిర్మాణానికి రూ.4.10 కోట్లు నాబార్డ్ నిధులు మంజూరయ్యాయని ఆర్‌అండ్‌బీ ఈఈ రాజానయాక్, డీఈ గోపీకృష్ణ సోమవారం తెలిపారు. నిర్మాణ పనులు కూడా రెండు రోజుల్లో ప్రారంభం కానున్నట్లు వెల్లడించారు. రోడ్డు నాణ్యతగా నిర్మించడానికి వీలుగా ప్రస్తుతం బీటీ లేయర్ తొలగించడం జరుగుతోందన్నారు. దీని వల్లనే కారెంపూడి ఇందిరానగర్ కాలనీ వద్ద మంచినీటి పైపులైన్ లీకవ్వడం జరిగిందని రోడ్డుపై నీరు నిలిచిపోవడం జరిగిందన్నారు. అసౌకర్యం కలిగినా రోడ్డుపై అలా నీరు నిలిచి ఉండడం వల్ల ఎక్కడన్నా లూజ్ సాయిల్ ఉన్నా సెట్ అవుతుందన్నారు. మండలంలోని నరమాలపాడు గ్రామం నుంచి పేటసన్నెగండ్ల బ్రిడ్జి వరకు ఉన్న 11 కిలోమీటర్లలో 9 కిలోమీటర్లు రోడ్డు నిర్మాణం జరగనుందన్నారు. గతంలో కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడం వల్ల పనులు చేపట్టడంలో జాప్యం జరిగిందన్నారు. ప్రస్తుతం నాబార్డ్ నిధులు మంజూరు కావడంతో కాంట్రాక్టర్లు పనులు చేయడానికి ముందుకొచ్చారని మరో రెండు రోజుల్లో పనులు ప్రారంభం అవుతాయని తెలిపారు. రెండు లైన్ల బీటీ రోడ్డు వేయనున్నామన్నారు. మంచి సౌకర్యవంతమైన రోడ్డు మరో రెండు నెలల్లో పూర్తి చేస్తామని ఈఈ రాజానాయక్, డీఈ గోపీకృష్ణ వివరించారు.

ఆరోగ్యశ్రీతో ఆరోగ్య భద్రత



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు

దాచేపల్లి : వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ప్రతి మనిషి భద్రతకు భరోసాగా నిలుస్తుందని ఎంపీపీ కటకం జయశ్రీ అన్నారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. అనంతరం ఎంపీపీ జయశ్రీ మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా రూ.25 లక్షల వరకు ఉచితంగా వైద్య సేవలు పొందే అవకాశం ప్రభుత్వం కల్పించిందని, ప్రజల ఆరోగ్యం పట్ల ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుందని చెప్పారు. జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ.. దివంగత మహానేత వైఎస్సార్ ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ పథకం దేశానికే ఆదర్శంగా నిలిచిందని, ఆయన తనయుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీ పథకాన్ని మరింతగా బలోపేతం చేసి పేదల ఆరోగ్యం కాపాడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శోభారాణి, ఏపీఎం నాయక్, సర్పంచ్ కూసం నాగిరెడ్డి, ఎంపీటీసీ ఆకూరి వీరారెడ్డి, నాయకులు ముత్యం చెన్నారెడ్డి, ఐలాపురం నరసింహారావు పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



తహసీల్దార్ పుల్లారావు ఎదుట రౌడీషీటర్లను హాజరుపరిచిన ఎస్ఐ సామెల్ రాజీవ్‌కుమార్

రెంటచింతల: మండలంలోని వివిధ గ్రామాలలో రౌడీషీట్ ఉన్న ప్రతి ఒక్కరూ తమ నేర ప్రవర్తనను మార్చుకుని జీవించాలని ఎస్ఐ సామెల్ రాజీవ్ కుమార్ అన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ కట్టేకోట పుల్లారావు ఎదుట మండలంలోని రెంటాల, మిట్టగుడిపాడు, పశర్లపాడు, మంచికల్లు, జెట్టిపాలెం గ్రామాలకు చెందిన 35 మంది రౌడీషీటర్స్‌ను హాజరుపరిచి కౌన్సెలింగ్ ఇచ్చి మాట్లాడారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని జిల్లా పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వివిధ గ్రామాలలోని రౌడీషీటర్లను దశలవారీగా పిలిపించి కౌన్సెలింగ్ ఇస్తున్నట్లు తెలిపారు. మండలంలో 11 గ్రామాలకు సంబంధించి మొత్తం 85 మంది రౌడీషీటర్లు ఉండగా ఇప్పటి వరకు తహసీల్దార్ ఎదుట 68 మందిని బైండోవర్ చేశామని మరో 17 మందికి కూడా త్వరలో కౌన్సెలింగ్ ఇవ్వడం జరుగుతుందన్నారు. గ్రామాలలో ప్రజలను ఇబ్బంది పెట్టినా.. భయ పెట్టినా..ఒత్తిడి చేసినా అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రశాంతంగా ఉన్న గ్రామాలలో గొడవలు పెట్టుకుని శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గురుకులానికి నూతన శోభ



నూతనంగా నిర్మించిన భవనం

కారెంపూడి: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలుర పాఠశాల, కళాశాలకు ఎట్టకేలకు అదనపు తరగతి గదులు సమకూరాయి. సుమారు రూ.2 కోట్ల వ్యయంతో ప్రభుత్వం నూతన తరగతి గదుల భవనం నిర్మించింది. నిర్మాణం కూడా పూర్తయ్యింది. త్వరలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి చేతుల మీదుగా ప్రారంభోత్సవం జరగనుంది. 1983లో గురుకుల పాఠశాల ఎస్ఎస్‌పీకి చెందిన పాత బడిన క్వార్టర్స్ (మట్టి మిద్దెలు)లో ప్రారంభమైంది. తర్వాత 1990లో పాఠశాలకు అప్పటి విద్యార్థుల సంఖ్య ప్రకారం ఒక తరగతి గదుల భవనం నిర్మించారు. తర్వాత ఇక్కడ ఇంటర్మీడియట్ కూడా ప్రారంభమైంది. విద్యార్థుల సంఖ్య కూడా క్రమేణా పెరిగింది. దీంతో తరగతి గదుల సమస్య తలెత్తింది. అదనపు తరగతి గదులు కావాలని గత పదేళ్లుగా విద్యార్థులు వారి తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ క్రమంలో వారి కలను ప్రభుత్వం నూతన భవనం నిర్మించి సాకారం చేసింది. నాడు-నేడు పనులతో పాటు భవన నిర్మాణంతో పాఠశాలకే వన్నె వచ్చింది. పాఠశాలకు ముందున్న పాడుబడిన పాత భవనాలను తొలగించడంతో ఆట స్థలం కూడా సమకూరి పాఠశాల ప్రస్తుతం అందంగా కన్పిస్తోంది.

క్రీస్తుమార్గాన్ని అనుసరించండి



మాచాయపాలెంలో సెమీ క్రిస్‌మస్ వేడుకలలో ఎంపీపీ పద్మా వెంకటేశ్వరరెడ్డి

బెల్లంకొండ: లోకానికి శాంతి, ప్రేమ మార్గాలను ప్రబోధించిన ఏసుక్రీస్తు మార్గాన్ని ప్రతీ ఒక్కరూ అనుసరించాలని ఎంపీపీ చెన్నపరెడ్డి పద్మా వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. మండలంలోని మాచాయపాలెం గ్రామంలో క్రీస్తు సంఘ పెద్దల ఆధ్వర్యంలో సోమవారం రాత్రి సెమీ క్రిస్‌మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాటి వారిని ప్రేమించి, ఆదరించినప్పుడే సమాజ శ్రేయస్సు సాధ్యమవుతుందని తెలిపారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు, చిన్నారులతో పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. సంఘ పెద్దలు, సభ్యులతో కలసి ఎంపీపీ కేక్ చేసి, శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ రామనబోయిన లక్ష్మీ నారాయణ, పార్టీ నాయకులు చింతారెడ్డి సాయిరెడ్డి, బద్దూరి బ్రహ్మారెడ్డి, భూపాల్‌రెడ్డి, శ్రీనివాసరాజు, సంఘ పెద్దలు జుజ్జూరపు నాగేశ్వరరావు, వెంకట్రావు, ఏసోబు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

న్యాయవాదులు విధులు బహిష్కరణ

సత్తెనపల్లి: ప్రజల ఆస్తులకు భద్రతలేని భూ హక్కుల చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మారురి లింగారెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని నాలుగు న్యాయస్థానాల్లో విధులను న్యాయవాదులు సోమవారం బహిష్కరించారు. తాలూకా న్యాయస్థానాల భవనం ముందు న్యాయవాదులు నినాదాలు చేస్తూ నిరసన చేపట్టారు. కార్యక్రమంలో న్యాయవాదులు పి.వి.నరసింహశాస్త్రి, దేవినేని దస్తగిరిరావు, తదితరులు పాల్గొన్నారు.